విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గర్డర్ల ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : కోటిపల్లి గౌతమి నది వద్ద రైల్వేపిల్లర్స్ పై గర్డర్స్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్ దక్కించుకున్న ప్రసాద్ & కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో సోమవారం సందర్శించినట్లు కోనసీమ జెఏసి నాయకులు బండారు రామ మోహనరావు తెలిపారు. గత ఏడాది నవంబర్ లోనే టెండర్ ఖరారు అయినప్పటికీ, సంబంధిత పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. కంపెనీ ప్రొక్యుర్మెంట్ మేనేజర్ ఎ. మనిందరరాజుతో మాట్లాడుతూ బొంబాయికి చెందిన ఆర్కిటెక్ట్‌తో ఇప్పటికే డిజైన్(బ్లూ ప్రింట్) గీయించి అప్రూవల్‌కు రైల్వే కార్యాలయానికి పంపినట్టు తెలిపారు. చిన్న, చిన్న మార్పులు చేర్పులు సూచించే అవకాశం ఉందనీ, లేని పక్షంలో డైరెక్ట్‌గా అప్రూవల్ చేస్తే వెంటనే పనులు ప్రారంభించడానికి తమ యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యత నివ్వాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ జే వెంకటరావు, అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 12 మంది వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. టిడ్కో పథకంలో చెల్లించిన సొమ్ములు వెనక్కు ఇవ్వాలని, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అక్కడే ఉన్న అధికారులను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించడంతో పాటు, అందుకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి. సత్య కుమారి, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఉమ్మడి సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ఈ నెల 28వతేదీన తాడేపల్లిగూడెంలో జరగబోయే తెలుగుదేశం, జనసేనపార్టీల ఉమ్మడి సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ రెండు పార్టీలు కలిపి తనను కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లకు ఇందుకు సహకరించిన ఇరు పార్టీల శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వైసీపీ పాలనను అంతమొందించి ప్రజాపాలన తీసుకురావడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం రైతు ప్రధానకార్యదర్శి ఆకుల రామకృష్ణ, పల్లి శాంత కుమారి, చిక్కం శివాజీ నాయుడు, డిఎస్‌పి నాయుడు, బాబీ, తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొత్తపేట సీటు కేటాయింపుపై పునరాలోచించాలి

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావుల పాలెంలో కాపు కళ్యాణ మండపంలో కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన, టిడిపి పొత్తులో భాగంగా కొత్తపేట సీటు తెలుగుదేశం పార్టీకి కేటాయించటంతో కొత్తపేట నియోజకవర్గ జనసైనికులు అసంతృప్తికి లోనయ్యారని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనసేన పార్టీ అత్యధికంగా బలంగా ఉన్న నియోజకవర్గం కొత్తపేట మాత్రమే అన్నారు. రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్న కొత్తపేటను పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తెలుగుదేశానికి కేటాయించటం పునరాలోచన చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేన, టిడిపి సభ విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - అమలాపురం : ఈ నెల 28వ తేదీ బుధవారం తాడేపల్లి గూడెంలో జరుగు ఎన్నికల శంఖారావం సభ తెలుగు జన విజయ కేతనం జెండా మీకోసం మీ వెంటే అనే నినాదంతో వైసీపీ విముక్త ఆంధ్ర రాష్ట్రం కోసం పవన్ కళ్యాణ్, చంద్రబాబు నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిక్కాల సతీష్, సుధా చిన్న, మహా దశ నాగేశ్వరరావు, చిక్కం భీముడు, సందడి శ్రీను, గండి మణికంఠ స్వామి, కడిమి చినబాబు, తాళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఉన్న బోర్డులను సరి చేయాలి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలో స్థానిక మొగలి సూర్యుడు చెరువు గట్టు పై వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్న నేపథ్యంలో నగర పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు తప్పుల తడకగా దర్శనమిస్తుంది. ఈ బోర్డులో గొల్లప్రోలు నగర పంచాయతీ కాగా మున్సిపాలిటీ అని, అదీగాక గొల్లప్రోలు పిన్ కోడ్ 533445 అయితే 533450 అని ఉండటంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ బోర్డులో ఏర్పాటు చేసి నెలరోజులైన కనీసం తప్పులు సరి చేయలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తప్పులు సరి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

21న భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ ముట్టడి

విశాలాంధ్ర - కరప : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని, 12 14 మెమోని తక్షణం రద్దు చేయాలని కోరుతూ మార్చి 21న చలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు చెక్కల రాజ్ కుమార్ పేర్కొన్నారు. కరప శివాలయం వీధిలో ఉన్న గణేష్ భవన నిర్మాణ కార్మికుల భవనంలో సోమవారం సమావేశం జరిగింది. కార్మికుల హక్కుల కోసం కార్యాచరణ రూపొందించనున్నట్టు ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులు దాచుకున్న సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించారని రాజకుమార్ తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల చలో కలెక్టరేట్ ముట్టడికి వేలాదిగా తరలి రావాలని ఆయన కోరరు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మలక రమణ, కామిరెడ్డి సురేష్, నున్న తాతీలు, శివ సుబ్రహ్మణ్యం నూకరాజు, రాంబాబు పాల్గొన్నారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు.

రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర -నల్లజర్ల: నల్లజర్ల మండలం నల్లజర్ల గ్రామం నుండి కోయిలగూడెం వెళ్లే రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఎప్పటినుంచో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆ గోతుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పటినుంచో అధికారులను వేడుకొనగా నూతనంగా రోడ్లు తారుపోస్తున్నారు. ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నికలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి పూర్తిగా తెలుసుకుని ఎన్నికల విధులు నిర్వహణలో సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని విధాన గౌతమి సమావేశ మందిరంలో 2024 అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికలలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై ఎమ్‌సిసి, వ్యయం పరిశీలకులు, వియస్‌టి, వివిటి, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టిటీములకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఎమ్‌సిసి, వ్యయ పరిశీలకులు, వియస్‌టి, వివిటి, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టిల పాత్ర చాలా ముఖ్యం అని అన్నారు. ఈ టీములు ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను నిష్పక్షపాతంగా అమలు చేయాలని సూచించారు. ఏ పరిస్థితుల్లో ఏ విధంగా చర్యలు తీసుకోవాలో ఈసీఐ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌లో తెలియజేయడం జరిగిందని, ప్రతి దానిని మీరు నిష్పక్షపాతంగా అమలు చేయవలసి ఉందని కలెక్టర్ అన్నారు. గతంలో రిపోర్టులు మాన్యువల్‌గా పంపించేవారని ప్రస్తుతం మాన్యువల్‌గా ఆదేశాలు ఇవ్వడం గానీ రిపోర్టులు పంపించడం గాని అన్ని ఈఎస్ఎంఎస్ ద్వారానే జరుగుతాయని ఈ ఎస్ ఎం ఎస్ నిర్వహణ ప్రతి ఒక్కరూ సక్రమంగా నిర్వహించడం నేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈఎస్ఎంఎస్ మొబైల్ యాప్ అని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా దీనిని డౌన్లోడ్ చేసుకుని అధికారి హెూదా, మొబైల్ నెంబర్ తదితర వివరాలను నమోదు చేసి లాగిన్‌ను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంసిసి నోడల్ అధికారి, డిపీఒ భారతి సౌజన్య, ఐటీ నోడల్ అధికారులు యస్ ఐసిడి ఐఓ సుబ్బారావు, ట్రైనింగ్ నోడల్ అధికారి, కాకినాడ డీఎల్ డివో నారాయణమూర్తి, పెద్దాపురం డిఎల్‌డిఓ ప్రసాదరావు, ఎంసిసి టిమ్ సభ్యులు, ఎన్నికల వ్యయం పరిశీలకులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి విద్యకు శాపంగా మారిన మండల విద్యాశాఖ కార్యాలయం

విశాలాంధ్ర - ఆలమూరు : విద్యాహక్కు చట్టం కింద 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కొరకు ఈనెల 23 నుండి మార్చి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి చదువుతున్న చిన్నారులకు ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించారు. ఇదిలా ఉండగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విశేషం. గతంలో ఎంఈఓ స్థానంలో ఒక అధికారి మాత్రమే ఉన్నప్పటికీ మండల ప్రజలకు ఉపయోగకరమైన అనేక సమాచారాలు తెలియజేసేవారని, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఏంఈఓ-1, ఏంఈఓ-2గా నియమించి బాధ్యతలు అప్పగించినప్పటికీ ఎటువంటి ఉపయోగంలేదని పలువురు ప్రజలు వాపోతున్నారు. సమగ్ర శిక్ష అధికారులు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య కొరకు మండల విద్యాశాఖకు సమాచారం అందించినప్పటికీ నేటికీ మండల ప్రజలకు సమాచారం అందించకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడం విశేషం. ఇప్పటికైనా ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి పేద విద్యార్థులకు సహకరించాలని పలువురు తల్లిదండ్రులు కోరారు.

స్పందన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా..డీఆర్వో డి.తిప్పే నాయక్, హౌసింగ్ పీడీ ఎస్‌వివి. సత్యనారాయణ, డీఆర్ డిఏ పీడీ కె రమణి, సీపీవో పి. తినాథ్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాంగోపాల్‌లతో కలిసి హాజరై జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కరించవలసిందిగా ఆయా శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం-415 అర్జీలు వచ్చాయి. గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు సంక్షేమ వారధులు వలంటీర్లు

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు సంక్షేమ వారధులు వలంటీర్లు అని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలులో గ్రామ వలంటీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని ఆయా గ్రామాల వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దొరబాబు వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ సేవా సైనికులు గ్రామ వలంటీర్లు అన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను చేరవేయాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపుతో గ్రామం సుభిక్షం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతి ఒక్కరు తమ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని తద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని దివాన్ చెరువు గ్రామానికి చెందిన శారద నర్సింగ్ హెూం ప్రముఖ వైద్యులు డాక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని దివాన్ చెరువు గ్రామానికి చెందిన సేవ ఉగాది 9 వసంతాలు పూర్తయిన సందర్భంగా సేవ ఉగాది ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు.దీనిలో భాగంగా వైద్యులు రాంబాబు,నన్నయ వర్సిటీ అధ్యాపకులు ఆచార్య తలారి వాసు,బీసీ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ వంక మల్లిఖార్జున స్వామి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గ్రంధి నానబ్బులు తదితరులు వివిధ జాతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మనమే వృక్షాలను తొలగిస్తామని, అందుచే ప్రతిఒక్కరు తిరిగి మొక్కలు నాటాలని కోరారు. నన్నయ వర్సిటీ అధ్యాపకులు ఆచార్య తలారి వాసు మాట్లాడుతూ ఒక మొక్క నాటడం ద్వారా కుటుంబం ఆరోగ్యాన్ని నాటుతున్నామని వివరించారు.బీసీ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ వంక మల్లిఖార్జున స్వామి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పక్షులకు,జంతువులకు సేదతీర్చడం మానవుల కు సంపూర్ణ ఆరోగ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నన్నయ వర్సిటీ అధ్యాపకులు ఆచార్య తలారి వాసు,బీసీ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ వంక మల్లిఖార్జున స్వామి,సచివాలయం సెక్రటరీ కుమార్, గోదావరి విద్యాపీఠం స్కూల్ ఛైర్మన్ వీర వెంకట్రావు, యోగ గురువులు రమణ, నరకుల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి : జిల్లా వైద్యాధికారి నాయక్

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే నరసింహ నాయక్ అన్నారు. స్థానిక ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే నరసింహ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఓపి సేవలు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, లాబరేటరీ, నర్సింగ్ స్టేషన్, ఫార్మసీ సేవలు, రికార్డులు పరిశీలించారు. మరింతగా విధులు నిర్వహించడానికి సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టరు బి. సురేంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శర్మ, సూపర్వైజర్ సిబ్బంది రూతమ్మ, చెల్లారావు, ఈశ్వరమ్మ, ఫార్మసిస్ట్ హైమవతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్ర పురం గ్రామంలో ఏలేరు కాలువ గట్టుకు అనుకుని ఉన్న స్మశాన వాటికను ఆక్ర మించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని రామచంద్రపురం గ్రామానికి చెందిన పలువురు దళితులు సోమవారం మండల కేంద్రమైన కిర్లంపూడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత నాయకులు తాతపూడి వెంకటరమణ, కాకాడ సూర్యుడు తదితరులు మాట్లాడుతూ దళితులకు చెందిన స్మశాన వాటిక భూమిలో అదే గ్రామానికి చెందిన కాకాడ సత్యనారాయణ, కాకాడ కృష్ణమ్మ దంపతులు స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకొని గతంలో పాక వేసుకుని చికెన్ వ్యాపారం చేసుకునేవారని, ఇప్పుడు అదే స్థలంలో పక్కా భవనం నిర్మిస్తున్నారన్నారు. స్మశాన వాటిక ఆక్రమణపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటికను ఆక్రమణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె. సాయికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాతపూడి వెంకటరమణ, కాకాడ సూర్యుడు, కాతేటి ఏసు, తాతపూడి అప్పారావు, అధిక సంఖ్యలో దళితులు పాల్గొన్నారు.

వారంలోగా ఎమ్మెల్యే ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మత్స్యకారులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై వారంలోగా క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామంటూ మత్స్యకారులు అల్టిమేటం జారీ చేశారు. మత్స్య కారులను దోపిడీదారు లంటూ చేసిన వ్యాఖ్యలను ద్వారంపూడి నేటి వరకు వాటిని వెనక్కి తీసుకోకపోగా ఇంకా అహంకారంతోనే విర్రవీగుతున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కాకినాడలోని బాలాజీ చెరువు సెంటర్లో ఉన్న కాస్మోపాలిటన్ క్లబ్లో ఏపీ ఫిషర్మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకార కుల సంఘ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాష్ట్ర నలుమూలలకు చెందిన మత్స్యకార నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, పుదుచ్చేరి నేత మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాకినాడ మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు)పై వ్యక్తిగతంగా మాట్లాడుతూ అనంతరం మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు. అప్పటినుంచి మత్స్యకారులు పలు విధాలుగా ఆవేదనలు వ్యక్తం చేసినా ద్వారంపూడి వైఖరిలో మార్పు రాలేదన్నారు. రాష్ట్ర నాయకులు సైకం రాజశేఖర్, బర్రి ప్రసాద్లు మాట్లాడుతూ ద్వారంపూడి అహంకారానికి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బలసాలి ఇందిర, మత్స్యకార నాయకులు మల్లాడి రాజు, తుమ్మల సునీత, తుమ్మల రమేష్, కోలా ప్రసాద్ వర్మ, విశ్వనాధపల్లి సత్యనారాయణ రాజు, బొద్దు సత్యనారాయణ, పినపోతు తాతారావు, గంటా వెంకటలక్ష్మి, మల్లాడి రాజేంద్రప్రసాద్, కర్రి చిట్టిబాబు, బడే కృష్ణ, బాలిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ బీచ్ పార్క్ వద్ద టీఎం-142ఎం యుద్ధ విమానం ఏర్పాటు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు భారత సాయుధ దళాల కార్యకలాపాలపై యువతలో స్ఫూర్తిని రగిలించే లక్ష్యంతో భారత నౌకాదళానికి చెందిన టీఎం-142ఎం యుద్ధ విమానాన్ని కాకినాడ బీచ్ పార్క్ వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగాగీత పేర్కొన్నారు. కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ. 5.89 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన టీఎం-142ఎం విమాన ప్రదర్శనశాల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, కాకినాడ పట్టణ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, కమాండెంట్ నేవీ చీఫ్ సుధీప్, కాకినాడ కమిషనర్ జే వెంకటరావు, కూడ చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై విమాన ప్రదర్శనశాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఎంపీ వంగా గీతా ప్రసంగిస్తూ భారత రక్షణ రంగంలో నౌకాదళంలో సుదీర్ఘంగా 30 సంవత్సరాల పాటు సేవలు అందించిన ఎయిర్ క్రాఫ్ట్‌ను కాకినాడ బీచ్ పార్క్‌లో ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం అన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ కాలంగా కలలుగన్న ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు భారత రక్షణ రంగంలో సుదీర్ఘంగా సేవలు అందించిన ఈ ఎయిర్ క్రాఫ్ట్ కాకినాడలో బీచ్ పార్క్ లో ఏర్పాటుచేయడం గొప్ప విశేషమన్నారు. కమాండెంట్ నేవీ చీఫ్ సుధీప్ మాట్లాడుతూ ఈ ఎయిర్ క్రాఫ్ట్ ప్రోజెక్ట్ ఏర్పాటులో తనని భాగస్వామ్యం చేసిన కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ టీం అందరికీ ప్రత్యేకంగా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కూడ వీసీ, ఎండీ పీ రామకృష్ణ, కాకినాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యులు ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధికి శ్రీకారం

వర్చువల్ పద్ధతిలో పనులు ప్రారంభించిన ప్రధాని మోడీ

విశాలాంధ్ర - సామర్లకోట : దేశంలో మునుపెన్నడూ జరగని అభివృద్ధి కార్యక్రమాలు గత పది సంవత్సరాల నుండి పేదలకు సంక్షేమం, మౌలిక వసతులను కల్పించడం ద్వారా నరేంద్ర మోడీ నాయకత్వంలో చూడడం జరుగుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధిలో భాగంగా రూ.15.13 కోట్లతో సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు మరియు విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైల్వే స్టేషన్లో ఆధునీకరణకి సంబంధించి వర్చువల్ విధానంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం పనులను ప్రారంభించారు. సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై కార్యక్రమాన్ని నిర్వహించగా బిజేపి నాయకులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన సూర్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సుమారు 72 కార్యక్రమాల ద్వారా సుమారు 3141 కోట్ల రూపాయలతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధితో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక సంవత్సరాలుగా కోనసీమ రైలు కల కాగా ప్రధాని నరేంద్ర మోడీ సుమారు కోనసీమ రైల్వే లైన్లుకి సుమారు 1000 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీడియో ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, పెద్దాపురం బిజెపి కన్వీనర్ విత్తనాల వెంకటరమణ, పైడా భావన ప్రసాద్, తుమ్మల పద్మజ, విజయవాడ డివిజన్ నోడల్ ఆఫీసర్ ఏడిఆర్ఎం రామకృష్ణ, సుంకవిల్లి బాపిరాజు పాల్గొన్నారు. అంతకు ముందు పలువురు విద్యార్థినిలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, వారికి బహుమతి ప్రదానం చేశారు.

ఎస్.యానంలో నాలుగు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మంత్రిగా అభివృద్ధి పనులకే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు రాష్ట్ర రవణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ స్పష్టం చేసారు. ఉప్పలగుప్తం మండలం యస్ యానం గ్రామంలో సుమారు నాలుగు కోట్లరూపాయలు నిధులు ఖర్చు చేసి ఎస్సీ, బిసిలకు కోటి తొంభై లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాలకు, పద్నాలుగు లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లుకు పశువుల ఆసుపత్రి, అంగన్‌వాడీ భవనాలను త్రాగు నీరు సరఫరా ఓవర్ హెడ్ ట్యాంక్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో వేదాంతకు చెందిన సిఎస్ఆర్ నిధులతో మిగిలిన పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధంగా వున్నాయని నెల రోజులలో అవన్నీ పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాజేశ్వరి రాజా, జడ్‌పిటిసి గెడ్డం సంపదరావు, ఎంపిపి దంగేటి అచ్యుత జానకీ రాంబాబు, ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షులు పెట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో సోమవారం పునీత జాన్ మరియతల్లి దేవాలయానికి ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరాం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ శిథిలావస్థకు వచ్చిన ఆలయాన్ని తొలగించి నూతనంగా అన్ని హంగులతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పునీత జాన్ మరియా తల్లికి అన్ని అంగులతో ఆలయాన్ని నిర్మించాలన్న కోరిక ఫాదర్ డానియల్ కు కలిగిందని ఆయన తెలిపారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత ఆలయానికి 12 కిలోమీటర్లు దూరంలో ఈ ఆలయం నిర్మించటం సంతోషకరమైన అన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎర్నగూడెం సర్పంచ్ బొంత భరత్ బాబు ఆలయ నిర్మాణానికి 100 బస్తాల సిమెంట్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీ రావు, గౌరీపట్నం నిర్మలగిరి క్షేత్రం డైరెక్టర్ జాను పీటర్, స్థానిక నేతలు పోతులు కనకరాజు, నరహరిశెట్టి దొరబాబు, ఎర్నగూడెం చర్చి ఫాదర్లు, గురువులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలలో అద్భుత ప్రదర్శన

విశాలాంధ్ర - గోకవరం: చెన్నైలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన సుగంధం అంజి దుర్గ గణేష్‌ను విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షులు కంబాల శ్రీనివాస రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం గ్రామానికి చెందిన సుగంధం అంజి దుర్గ గణేష్ బ్యాడ్మింటన్ ఆట లో అద్భుతమైన ఆటను ప్రదర్శించినట్లు,చెన్నైలో ఈ నెల 18 జరిగిన స్టేట్ సబ్ జూనియర్స్ బ్యాట్మెంటన్ పోటీలలో అండర్ 19 విభాగం లో సింగిల్స్,డబుల్స్ ద్వితీయ స్థానం,అండర్ 17 విభాగంలో డబుల్స్ ద్వితీయ స్థానం,సింగిల్స్ తృతీయ స్థానం గెలవడం ఎంతో సంతోషం ఉందన్నారు. ఈ పోటీలకు వెళ్లే ముందు దారి ఖర్చులు నిమిత్తం 5000 రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర,వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధ శర్మ పాల్గొన్నారు.

రాక్షస పాలనను అంతం చేద్దాం

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలని, దీనిలో భాగంగా టిడిపి-జనసేన పార్టీ కలిసిపనిచేసి విజయం సాధిద్దామని కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి అన్నారు. దొమ్మేరు గ్రామంలోని యలమర్తి రాంబాబు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో సభ్యుడు కంటమణి రామకృష్ణ మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం సత్తాను చాటాలని, దీనిలో భాగంగా 28వ తేదిని తాడేపల్లిగూడెంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు మాట్లాడుతూ టిడిపి, జనసేనలో ఏ పార్టీకి సీటు వచ్చినా అందరూ కలిసి పనిచేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు మండల పార్టీ ప్రెసిడెంట్ వట్టికూటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం పరిశీలకులు గొర్రెల శ్రీధర్ , బహిరంగ సభ క్రౌడ్ మొబైలైజేషన్ అబ్జర్వర్ చిరుమామిళ్ల సూర్య నారాయణ ప్రసాద్, తెలుగుదేశం, జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

28న మెగా ప్రాంతీయ జాబ్‌మేళా

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి , పశ్చిమ , కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మార్గాని ఎస్టేట్ ప్రాంగణంలో ఈ నెల 28వ తేదీన “మెగా ప్రాంతీయ జాబ్ మేళా” నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు “9676052454”, 9133912947”నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: కడియద్ద గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీవాసవి జాతీయ సేవా పథకం (ఎన్. ఎస్. ఎస్.) ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం ఆశ్రం వైద్య కళాశాల సౌజన్యంతో ఉచిత మెగా వైద్య

శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల పాలక వర్గ అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ వైద్య శిబిరాన్ని ప్రారంభించగా ఆశ్రం వైద్య కళాశాల డాక్టర్లు గ్రామం నుండి వచ్చిన ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎన్. ఎస్. ఎస్.సేవా కార్యక్రమాలలో పాల్గొని ప్రజలకు సేవ చేయడం, ఇలాంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం ద్వారా సమాజానికి దగ్గర అవ్వడమే కాకుండా మంచి పేరును కూడా సంపాదించగలరన్నారు. కడియద్ద గ్రామ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడియద్ద గ్రామ సర్పంచ్ యాతం కోటేశ్వరి, గ్రామ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఎంపీటీసీ దుర్గాదేవి. ఆశ్రమ్ కళాశాల వైద్యులు డాక్టర్ తరుణ్ సాయి, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ చందన, సాయి లక్ష్మీ, కళాశాల ఎన్. ఎస్. ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్.రాజ శేఖర్ తదితరుల ప్రసంగించారు. అదనపు ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.ఎల్.ఆర్ లోకేష్ బాబు, కో ఆర్డినేటర్ మరియు ఎన్. ఎస్. ఎస్.విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పెదపాడు: సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండా లని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. పెదపాడు మండలం జెడ్పి హై స్కూల్ లో ఉన్న విద్యార్థినులతో దిశ యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వలన కలుగు నష్టాలు తీసుకోవలసిన చర్యలను గురించి సిబ్బంది తో కలిసి విద్యార్థినిలకు అవగాహన కార్యక్ర

మాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శుభ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను గురించి విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన కాలంలో ప్రతి ఒక్కరు చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ను కలిగి ఉంటున్నారని దాని వలన ప్రపంచమే అరచేతిలో ఇమిడిపోయినట్లు, సోషల్ మీడియా ఉద్యమాల ద్వారా ప్రపంచంలో జరిగే వింతలు విశేషాలను తెలుసుకోవడంలో తప్పు లేదన్నారు.సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా అపరిచిత వ్యక్తులతో తగిన జాగ్రత్తలను వహించాలని, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, సందేశాలు ఓపెన్ చేయ వద్దన్నారు. ఇతర వ్యక్తుల ద్వారా వచ్చే సందేశాలను ఓపెన్ చేస్తే మన రహస్యమైన సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తస్కరిస్తారని విద్యార్థినిలకు అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి హై స్కూల్ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధినాయకుడి మాటే శిరోధార్యం

విశాలాంధ్ర - పెంటపాడు: మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ లు రాష్ట్ర భవిష్యత్తును, ప్రజల ప్రయోజనా లను, దృష్టిలో ఉంచుకొని తాడేపల్లి గూడెంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన

భారీ ఉమ్మడి బహిరంగ సభ సందర్భంగా జన సమీకరణలో భాగంగా తాడేపల్లి గూడెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) సోమవారం పెంటపాడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలను,పార్టీ శ్రేణులను కలిసి, ఆకుతీగపాడు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అధినాయకుడు చంద్రబాబు మాటే తనకు శిరోధార్యం అని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున సభాస్థలికి చేరుకుని ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈయన వెంట పెంటపాడు మండలం తెదేపా అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు దాసరి అప్పన్న, ఆకుతీగపాడు బాబు, పాతూరి రాంప్రసాదచౌదరి, గంధం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలి

విశాలాంధ్ర -భీమవరం: ప్రశ్నించే వారి మీద కేసులు పెట్టడం మాట వినకపోతే అరెస్టులు చేయించడం వంటిదుర్మార్గ చర్యలు ప్రభుత్వంలో సహజంగా మారాయని ఈ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చిరామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం భీమ

వరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కైంకర్యాలు జరగడం లేదు అన్న ఒక్క మాటకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు రమణ దీక్షితులపై కక్షగట్టి కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. చివరికి ఆయనే తిరిగి క్షమాపణ చెప్పే పరిస్థితి రావడం గర్హనీయమని, ఇటువంటి చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో లేని పింక్ డైమండ్‌ని సృష్టించి సాక్షాత్తు ముఖ్యమంత్రిని అవమానించేలా మాట్లాడినా కూడా బ్రాహ్మణులకు గౌరవం ఇచ్చే చంద్రబాబునాయుడు వారిపై ఎటువంటి చర్య తీసుకోకుండా విడిచిపెట్టారని, గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం బ్రాహ్మణులందరూ గ్రహించాలని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో నర్సాపూర్ పార్లమెంట్ కన్వీనర్ చెరుకుపల్లి సంతోష్ కుమార్ భీమవరం, తణుకు నియోజకవర్గం వేలూరు శ్రీధర్ శర్మ, చుండూరి శేషాద్రి, బేతనభట్ల సుబ్బులు, ఉండి సమన్వయకర్త కోళ్లపర్తి హరికృష్ణ, బేతనభట్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు

తెదేపా, జనసేనల మహాసభకు తరలిరండి

విశాలాంధ్ర -భీమవరం: తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జనసేనపార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ లు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లి గూడెంలో నిర్వహించే ఎన్నికల శంఖారావ మహాసభకు భీమవరం నియోజవర్గం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానులు, మద్దతు దారులు స్థానిక ప్రజానీకం అధిక

సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, టిడిపి టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర అధ్యక్షుడు గోట్టుముక్కల రఘురామరాజు పిలుపునిచ్చారు. జిల్లా టిడిపి కార్యాలయంలో భీమవరం పట్టణ టిడిపి ముఖ్య నాయకుల సమావేశం పట్టణ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చరిత్రాత్మక ప్రజాస్వామ్య విప్లవం కోసం తెలుగుదేశంపార్టీ జనసేనపార్టీల నాయకులు కార్యకర్తలు ప్రధానికంతో ఒకే వేదికపై ఇద్దరు జనప్రియ నేతలు రాష్ట్రాన్ని కాపాడడం కోసం జతకట్టారని త్వరలో జరగనున్న ఎన్నికల శంఖారావం పూరించడం కోసమే తాడేపల్లిగూడెంలో భారీ బహిరంగసభను నిర్వహించనున్నామన్నారు. ఈ సభకు తెదేపా జనసేన నాయకులు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయుల, టిడిపి అంగన్వాడి డ్వాక్రా ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం నూతన కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-ఆచంట: ఆచంట శ్రీరామేశ్వర స్వామి వారి దేవస్థానానికి నూతన కమిటీ ఏర్పాటు చేయుట జరిగింది.ఆలయ చైర్మన్ గా బి.విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాధ రాజు హాజరయ్యారు. శ్రీరామేశ్వర స్వామి వారి ఆలయం జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన దేవాలయమని, ధర్మకర్తల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయం వద్ద సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, సిబ్బంది, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు నియోజకవర్గం మరింత అభివృద్ధి

విశాలాంధ్ర-పోడూరు : పాలకొల్లు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పాలకొల్లులో వైసీపీకి ఎమ్మెల్యే లేని లోటు తీర్చాలని నియోజక వర్గ కన్వీనర్ గుడాల గోపి అన్నారు. పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని గల పోడూరు మండలం

లోని ఎనిమిది గ్రామాల వైసీపీ నాయకుల కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ పీతాని చిన్నా ఆధ్వర్యంలో ఆదివారం పెనుమదం శివాలయం ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుడాల గోపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు 99 శాతం అమలు చేసి ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చారన్నారు. మరిన్ని పథకాలతో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసి ముందుకు రానున్న వైఎస్ జగన్మోహన్రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేయాలని, పాలకొల్లులో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గం వైసీపీలో ఎటువంటి అసమ్మతి లేదని నాయకులంతా సమిష్టిగా పని చేస్తున్నార న్నారు. మండల కన్వీనర్ పేతాని సత్యనారాయణ (చిన్నా)మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే కాకుండా అన్ని వర్గాల పేదలకు లబ్ది చేకూర్చడం జరిగిందన్నారు. పాలకొల్లు జడ్పిటిసి నడపన గోవిందరాజులు, వైస్ ఎంపీపీ దొమ్మేటి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కొర్రపాటి వీరా స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

విశాలాంధ్ర-భీమడోలు: మండలం అంబరుపేట -కురెళ్లగూడెం గ్రామాల మధ్య రూ.6కోట్ల 91లక్షలతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి ని ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రధాని కార్యాలయం నుండి ప్రారంభించారు.

ఈసందర్భంగా సోమవారం అంబరుపేట ఆర్వోబి వద్ద ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, బీజేపీ శ్రేణులు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సభ వేదిక పై విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇటీవల రైల్వే శాఖ గురించి అవగాహన కల్పిస్తూ నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రైల్వే అధికారులు ప్రతిభ పురస్కారాలు అందించారు. అనంతరం ప్రధాని మోడి లైవ్ టెలికాస్ట్ ద్వారా ఆర్యూబిని ప్రారంభిం చారు. కార్యక్రమంలో రైల్వే ఏడిఈఈ చంద్రరావు, బీజేపీ ఉంగుటూరు ఇంచార్జ్ శరణాల మాలతీరాణి, కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ నాగగౌతమి, నాయకులు ప్రవీణ్ పటేల్, వెజ్జు ధర్మరావు, అడపా శోభారాణి, మామిడిపల్లి కృష్ణకుమారి, రైల్వే అధికారులు దానయ్య, ప్రసాద్, లోకేష్ లు పాల్గొన్నారు.

జనసేనపార్టీలో చేరికలు

విశాలాంధ్ర-నరసాపురం: జగన్ ప్రభుత్వ పనితీరుకు విరక్తి చెంది, జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి నరసాపురం నియో జకవర్గం మొగల్తూరు మండలం, గుంటపల్లవ పాలెం, పెదపల్లవపాలెం గ్రామాల నుంచి కీలక నాయకులు, కార్యకర్తలు, మహిళలు 200 మంది

జనసేన పార్టీలో చేరారు. సోమవారం జనసేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నరసాపురం ఇన్చార్జి బొమ్మిడి నాయకర్ వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి మొగల్తూరు మండల అధ్యక్షులు కొల్లాటి గోపీకృష్ణ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, నిప్పులేటి తారకరామారావు, బందెల రవీంద్ర, అందే దొరబాబు, తోట నాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర - బుట్టాయగూడెం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నూతన ఉత్తేజంతో యువత చంద్ర బాబుకి ఓటు వేయాలని పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. సోమవారం

బూసరాజుపల్లి టిడిపి క్యాంప్ కార్యాల యంలో మై ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖర, బొరగం మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు పాటుపడా లన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు పారేపల్లి రామారావు, మొగపర్తి సొంబాబు, గన్నిన సురేంద్రనాథ్ చౌదరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గ్రామ పరిశుభ్రతే ప్రధాన ధ్యేయమని పరింపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. సమైక్య యూత్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం గ్రామ ప్రజల సహకారంతో

గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య అవసరాలు నిమిత్తం కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను గ్రామపంచాయతీ సర్పంచ్ విజయ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం నిర్మూలన చేపట్టి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తమ ధ్యేయమని అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాల ప్రజలంతా చెత్తను డ్రైనేజీలలో, ఎక్కడ బడితే అక్కడ వేయకుండా పంచాయతీ ట్రాక్టర్ తమ వీధులలోకి వచ్చినప్పుడు ట్రాక్టర్ పై చెత్తను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడికొండ మురళీకృష్ణ, ముప్పిడి. చినబాబు, మట్ట.శ్రీనివాస్, చెప్పుల మధుబాబు, ఏపూరి సతీష్, నక్క బాబి, మేడిన కన్నయ్య, మందపాటి రామకృష్ణ, మడుతూరి. శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

విశాలాంధ్ర - పెంటపాడు: ప్రతి పేద కుటుంబానికి మేలు చేస్తున్న ఈ సంక్షేమ ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న అనేక పథకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారని మంత్రి కొట్టు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సోమవారం ఆయన సకల జన సమ్మేళన యాత్ర నిర్వహించారు.

పెంటపాడు మండలంలోని వల్లూరుపల్లి, దర్శిపర్రు, కే.పెంటపాడు, ముక్తేపురం, ఆకుతీగపాడు, చింతపల్లి, కోరుమిల్లి, అల్లంపురం గ్రామాలతో పాటు తాడేపల్లిగూడెం మండలంలోని కృష్ణయ్యపాలెం గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలను మంత్రి కొట్టు ప్రారంభించారు. వివిధ గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్,యువ నాయకులు కొట్టు విశాల్,వైకాపా కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్ భావన ధాన్యలక్ష్మీ సత్యనారాయణ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ తల్లాడ సత్తిపండు కుమార్తె గీతా నారాయణ ఏర్పాటు చేసిన గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల

రూపాయలు వెచ్చించి నిర్మించిన బోరు,మోటారు ను సోమవారం గీతా నారాయణ ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పలువురు నాయకులు గీతా నారాయణ సేవలను కొనియాడారు. గీతా నారాయణ మాట్లాడుతూ తన తండ్రి తల్లాడ సత్తిపండు ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివైఈవో రామన్నదొర,ప్రధానోపాధ్యాయు రాలు లోవ కుమారి, జెడ్పిటిసి పోల్నాటి బాబ్జి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు పడమటి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ప్రజలకు ఉత్తమ సేవలందించాలని ఆర్డీవో కే. అద్దయ్య అన్నారు.సోమవారం స్థానిక పాత ఆర్డీవో కార్యాలయాన్ని తహశీల్దార్ కార్యాల యంగా మార్పు చేయగా ఆర్డీవో అద్దయ్య ప్రారంభిం చారు. గత 40 సంవత్సరాలుగా అద్దె

భవనాల్లో తహశీల్దార్ నడుస్తూనే ఉంది. 2002 లో పట్టణంలో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయాన్ని అప్పటి రెవెన్యూ శాఖా మంత్రి అశోక గజపతి రాజు ప్రారంభించారు.ఆ వెంటనే జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ రావడంతో తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో కార్యాలయంగా మార్చారు.అప్పటినుండి 22 సంవత్సరాల పాటు ఆర్డీవో కార్యాలయం నడిచింది.ఇటీవల ఆర్డీవో కార్యాలయం వేరే చోట నిర్మించి కార్యాలయాన్ని అక్కడికి తరలించారు .దీంతో తహశీల్దార్ కార్యాలయం ఇక్కడకు మార్చారు.మండల ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆర్డీవో కోరారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే స్లీవ జోజీ ,ఆర్డీవో కార్యాలయ,తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న రామకోటయ్య

విశాలాంధ్ర-చాట్రాయి : నూజివీడు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగిన మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య అక్రమంగా ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించుకున్న వారి

గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారని పలువురు అంటున్నారు. గడచిన నాలుగు నెలలు క్రితం స్వతంత్ర అభ్యర్థిగా తను ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించిన దగ్గర నుండి నేటి వరకు రామకోటయ్య సంచలనాలకు ప్రతీక గా మారుతున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులను పరిశీలించడానికి వందలాది మంది అభిమానులతో కలిసి కాలవ వెంట పరిశీలన చేసి సమస్యను చర్చనీయాంశంగా మార్చారు. ఆ సందర్భంలో చాట్రాయి మండలంలో అధికార పార్టీకి చెందిన ప్రముఖ నేత ప్రైవేటు సంభాషణల్లో రామకోటయ్యను పరుష పదజాలంతో పోల్చడం వలన ఆగ్రహానికి గురైన రామకోటయ్య చాట్రాయి మండలం బూరుగగూడెం గ్రామంలో బూజు దులుపుతానని శపథం చేసారు.ప్రభుత్వ నిధులతో జరిగిన పనులపై సమాచార హక్కు చట్టం సమాచారం తీసుకున్నారు. ఇదే విషయాన్ని విశాలాంధ్ర ప్రచురించిన వెంటనే అధికారులు హడలెత్తి పోయారు.వాయువేగంతో బూరుగగూడెం రోడ్లకు గ్రావెల్ తోలకాలు ప్రారంభించారు.మరల గత రెండు రోజుల క్రితం నూజివీడు నడిబొడ్డులో ఎస్ ఆర్ ఆర్ హై స్కూల్ ఆవరణలోని స్థలాన్ని ఐదు కోట్ల రూపాయల విలువైన దాన్ని ఆక్రమణ జరిగిందని మీడియా సమక్షంలో ప్రత్యక్షంగా చూపించారు. నియోజకవర్గ మొత్తం ఇది పెద్ద హాట్ టాపిక్ గా మారిపోయింది. రామకోటయ్య ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడమే కాకుండా అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారని నియోజకవర్గ మొత్తం చర్చనీయాంశమైంది.

టీడీపీ, జనసేన సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జనసేన పొత్తు పెట్టుకుని పోటీ చేస్తున్న నేపథ్యంలో రెండు పార్టీల నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని మండల టీడీపీ అధ్యక్షులు నామన పరమేశ్వరరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు తాళ్ళపూడి లో పరమేశ్వర రావు సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ నెల 28 న జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్ టీడీపీ జాతీయ నాయకులు నారా చంద్ర బాబు నాయుడు హాజరవుతున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు కోటారు వెంకట్రావు, టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిలు మైనం వెంకట్, సిద్ధ దుర్గారావు, కైగాల శ్రీను, మద్దిపాటి ప్రకాశం, తీగిరిపల్లి గోపి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైకాపాను ఇంటికి సాగనంపడమే లక్ష్యం

విశాలాంధ్ర - ఏలూరు: వైకాపా ప్రభుత్వం దమనకాండకు పాల్పడుతోందని, రానున్న ఎన్ని కల్లో ఫ్యాన్ రెక్కలు విరగొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. తెదేపా విజయానికి కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, వైకాపాను ఇంటికి సాగనంపడమే లక్ష్యంగా

కృషిచేయాలని తెదేపా పరిశీలకులు పిల్లి మాణిక్యాలరావు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక బడేటి క్యాంపు కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం టిడిపి ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.దళిత, బిసి, మైనారిటీల ద్రోహి జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో కార్యకర్తల అభిమానం తాను ఎన్నటికి మరచిపోలేనని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి శాయశక్తులకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమా వేశంలో ఏలూరు నియోజకవర్గ పరిశీలకులు నవీన్ బాబు, తెదేపా రాష్ట్ర కేంద్ర పరిశీలకులు పిల్లి మాణిక్యాలరావు, టిడిపి ఎస్ సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జలా బాలాజీ,పాలి ప్రసాద్, టిడిపి నగర అధ్యక్షులు పెదబోయిన శివప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉండవల్లి అనిత, డిప్యూటీ మాజీ మేయర్ చోడే వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ టైలర్స్ డేలో పాల్గొనండి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రపంచ టైలర్స్ డేలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ సాయి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చా నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దొంతంశెట్టి బాబురావు(బాబీ టైలర్)లు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన జరగబోవు ప్రపంచ టైలర్స్ డేలో టైలర్స్ అందరూ పాల్యాగొనాలని వారు కోరారు. పట్టణ పరిధిలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అమ్మన్న టైలరింగ్ మెటీరియల్ షాపు వద్ద ప్రపంచ టైలరింగ్ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కావున ఏలేశ్వరం మండల మరియు రూరల్ పరిధిలోని టైలర్స్ అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రభుత్వంపై యుద్ధానికి మేము సిద్ధం

విశాలాంధ్ర - కాకినాడ : జనసేన పార్టీ పిఏసి సభ్యుల,కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో డివిజన్ అధ్యక్షుడు సుంకర సురేష్ మరియు డివిజన్ కార్యదర్శి సాధనాల గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక 36వ డివిజన్ బాలాజీ చెరువు, టీటీడీ కళ్యాణ మండపం ప్రాంతంలో గ్రీన్ టాక్స్‌తో లారీ మరియు ఆటోలను చంపేస్తున్న

జగన్ ప్రభుత్వం పై యుద్ధానికి మేము సిద్ధమే అనే కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా జనసేనపార్టీ శ్రేణులు మాట్లాడుతూ చాలామంది పేదలు మోటారు ఫీల్డులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారనీ, ఇంకొంతమంది ప్రయివేటు ఫైనాన్స్ నుండీ అప్పులు తీసుకుని ఆటోలను, రవాణ వాహనాలను కొని తిప్పుతుంటా రని, ఇలాంటి బడుగు జీవులను స్వయం ఉపాధికి ప్రోత్సహించకుండా వారి నెత్తిన గ్రీన్ టాక్స్ అని చెప్పి వీరి రక్తాన్ని పీల్చే జలగలాగ పన్నులు వసూలు చేస్తున్న ఈ వైసిపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంకే పన్నులు పెంచడానికి సిద్ధం అంటున్నాడని ప్రశ్నించారు. పోనీ గ్రీన్ టాక్స్ అని వసూలుచేస్తున్న డబ్బుతో మొక్కలు నాటే చిత్తశు ద్ధిలేని వీళ్ళు తిరిగి ముఖ్యమంత్రి పర్యటన పేరు చెప్పి చెట్లు నరికేస్తున్న ప్రభుత్వం ఇదన్నారు. ఇలాంటి వీళ్ళకు గ్రీన్ టాక్స్ పేరుతో పన్ను వసూలుకి నైతిక అర్హతలేదని దునుమాడారు. ఇంక కేవలం సుమారు నలభై రోజులు మాత్రమే వీరికి సమయం ఉందనీ ఆతరువాత ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు సిద్ధం అని ప్రజలు అంటున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో జనసేన పార్టీ, తెలుగుదేశంల కూటమికి మద్దతు ఇవ్వమని స్థానిక ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ, చీకట్ల శ్రీనివాస్, నారాయణరావు, రాజేశ్వరి, పావని, తరుణ్, మావులూరి సురేష్, సతీష్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, పాలిక శివ, సుంకర రామక్రిష్ణ, సత్తిబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సెలెన్స్ అవార్డు అందుకున్న ఒడిగో సంస్థ

విశాలాంధ్ర - కాకినాడ : హైదరాబాద్ ఎక్సెలెన్స్ అవార్డు అందుకున్న విజెఎస్ఎంఆర్ ఒడిగోస్ సిఈఓ వార వినోద్. స్థానిక రమణయ్యపేటలో 3 ఏపిఎస్పి వద్ద విజెస్ఎంర్ ఒడిగోస్ కార్యాలయంలో అభినందన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి విజెఎస్ఎంఆర్ ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆదివారం మనోహర్ హెటల్‌లో జరిగిన హైదరాబాద్ ఎక్సెలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో టాలీవుడ్ హీరోయిన్ ప్రణీత సుభాష్ చేతుల

మీదుగా బెస్ట్ ఐటీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (సాఫ్ట్వేర్ అండ్ వెబ్ డిజైన్) కేటగిరీలో హైదరాబాద్ ఎక్సెలెన్స్ అవార్డు అందుకోవడం జరిగింది అని తెలియజేసారు. ఈ సందర్భంగా సివైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు విజెస్ఎంర్ ఒడిగోస్‌ని అభినందించి మాట్లాడుతూ అంత్యంత విలువలతో కూడిన తర్ఫీనివ్వడం వల్లనా ఈ అవార్డు లభించదని మరిన్ని అవార్డ్స్ రావాలని ఆకాంక్షించారు. పోస్టల్ యూనియన్ నాయకులూ వార సత్యనారాయణ మాట్లాడుతూ విజెస్ఎంర్ ఒడిగోస్ చేస్తున్న సేవలు అబినందనీయం అని కొనియాడారు. అవార్డు గెలుచుకున్న విజెస్ఎంర్ ఒడిగోస్‌ను స్టేట్‌ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జూంగా గగరిన్, వాసిరెడ్డి ఏసుదాస్, దా పివివి సత్యనారాయణ, ధర్మ రావు, రేఖ రెడ్డి, బాలాజీ, జాషువు గిరి, మచ్చ బుజ్జి, జిం విల్సన్, మేరీ జ్యోతి తదితరులు అభినందించారు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : దేశంలో ఉన్న ఓటర్లందరూ బాధ్యతతో ఓటు వేయాలి అనే ప్రధాన సంకల్పంతో ఓటర్లందరికి చైతన్యం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన స్వీప్ నిర్వహణ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో మండల విద్యాశాఖ అధికారి జోసెఫ్

ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి మక్కా చిన్నారావు సూచనల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంతారావు సమక్షంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, మండల స్వీప్ కోఆర్డినేటర్ యన్ కన్న బాబు ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఓటర్లను చైతన్యం చేసే పాటలకు విద్యార్థులచే నృత్య రూపకం చేసారు. ఓటు వేయు దేశ భవితను నిలుపు అనే సాంఘిక లఘునాటికని విద్యార్థులచే ప్రదర్శించారు. స్థానిక రామాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది గ్రామ ప్రజలు హాజరయ్యారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. ప్రత్తిపాడు మండలం శరభవరం, గజ్జనపూడి గ్రామాల్లో సోమ వారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వరుపుల

సుబ్బారావు గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని గత ఐదు ఏళ్లలో వైయస్సార్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ళ క్రాంతి సుధాకర్, జడ్పిటిసి బెహరా రాజరాజేశ్వరి దొరబాబు, వైసిపి మండల కన్వీనర్ రామిశెట్టి నాని, సర్పంచి అప్పలరాజు, ఎంపిటిసిలు అమరాధి కాశి, మొల్లి వీరబాబు, వైసిపి గ్రామ కమిటీ కన్వీనర్ బర్ల నాగరాజు, గోనగాల వెంకటరమణ, బర్రె రామకృష్ణ, రామిశెట్టి దొరబాబు, రంగనాథ్ అబ్బాయి, అనకాపల్లి నూకరాజు, బోడపాటి వీర నాగేశ్వరరావు, బత్తుల శ్రీను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ అభ్యర్థుల ప్రచార వాహనాలు సిద్ధం

విశాలాంధ్ర - కాకినాడ : జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఆర్ఐ కొట్టె బ్రదర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రచార వాహనాలు కొట్టె వెంకటరావు, కొట్టె సాయి, కొట్టె వెంకటేశ్వర్లు, కొట్టె అర్షద్, చిల్లా మహేష్ నిర్వహణలో సోమవారం కాకినాడ రూరల్ నియోజకవర్గం

వలసపాకల గ్రామం గంగరాజు నగర్ రోడ్డు నెంబర్ 1లో గల పార్టీ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్‌లోని గ్రామాల్లో, డివిజనలలో ప్రచారనిర్వహణకు 20 ప్రచార వాహనాలను ప్రారంభించిన జనసేన పార్టీ పిఏసి సభ్యులు, కాకినాడ రూరల్ నియోజకవర్గం జనసేన & టీడీపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ తనయుడు పంతం సందీప్. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

పెద్దాపురం స్పందనకు 16 అర్జీలు

విశాలాంధ్ర - పెద్దాపురం : స్థానిక గుర్రాల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి దృష్టి సారించాలని పట్టణ వాసులు పలువురు వారం వారం నిర్వహించే స్పందనలో బాగంగా సోమవారం పెద్దాపురం ఆర్డీఓ జేవిఎస్ రామారావు వద్ద తన ఆవేదన వెలిబుచ్చారు. ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్ ట్రాక్ వెళ్లుతున్న వారికి అక్కడ అసాంఘిక కార్యకలాపాలు కనిపించడంతో మనస్ఫూర్తిగా పార్కులో గడిపే అవకాశం

లేకుండా పోతుందన్నారు. మద్యం బాబులు, చెప్పుకోలేని అసాంఘిక కార్యక్రమాలు అక్కడ నడుస్తున్నాయని, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం చొరవ చూపి పార్కు అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ జేవిఎస్ రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్లో ఆయా మండలాల నుంచి ఈ సోమవారం 16 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. స్పందనలో వచ్చే ప్రతీ అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. స్పందనలో వచ్చే ప్రతీ అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డిటీ భానుకుమార్, డిఎల్పిఓ బాలామణి, సీడీపీఓ ఉష మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.